

హెచ్‌ఎంటీకి భూముల కేటాయింపు.. వివాదం

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో రూ.కోట్లు విలువ చేసే అటవీ భూమికి వ్యవధి ముగిసినా కేంద్రప్రభుత్వ అనుబంధమైన హెచ్‌ఎంటీ కంపెనీకి ఆత్రుతగా మంజూరు చేయడం వివాదానికి కారణమైంది. అటవీశాఖ అధికారులకు నోటీసులు జారీ చేయడంతో వారు డోలాయమానంలో పడ్డారు. కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి, రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె మధ్య మాటలయుద్ధం సాగుతోంది. కేబినెట్ ఆమోదం లేకుండానే పీణ్యా, జాలహళ్ళి ప్లాంటేషన్‌లో హెచ్‌ఎంటీ కంపెనీకి అటవీభూములను డీ-నోటిఫికేషన్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అధికారుల తీరుపై మంత్రి ఖండ్రె అసంతృప్తి వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి భవిష్యత్తు ఏమిటి..?

- ముడా వివాదంలో పీకల్లోతు కష్టాల్లో సీఎం సిద్దు
- ఎఫ్‌ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశం
- ఎప్పుడైనా విచారణ ● కేవియట్‌కు ప్రత్యర్థులు
- సుప్రీంకు సీఎం



మీడియాతో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య భవిష్యత్తు ఏమిటనేది సర్వత్రా కుతూహలం నెలకొంది. సీఎంపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇస్తూ గవర్నర్ ఆదేశించారు. గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో ఆయన ముందు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేది లేదని, ఎటువంటి విచారణనైనా ఎదుర్కొంటానని సీఎం ధీమాతో ఉన్నారు. అధిష్ఠానం కూడా న్యాయ పోరాటానికి వెళ్లాలని సూత్రప్రాయంగా తెలిపినట్టు సమాచారం. మంగళవారం కోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా బెంగళూరుకు వస్తారని బుధవారం సీఎల్పీ ఉంటుందని ప్రచారం సాగింది. అయితే అటువంటి ప్రక్రియలు ఏవీ చోటు చేసుకోలేదు. కాగా రాజీనామా చేసే ప్రసక్తే లేదని, న్యాయ పోరాటం చేస్తానని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు.

ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాలతో ముచ్చెమటలు

హైకోర్టు పిటిషన్ కొట్టివేయడంతోనే రాష్ట్ర కాంగ్రెస్‌లో అలజడి మొదలైంది. హడావుడిగా అందరూ సిద్దరామయ్యకు మద్దతుగా ఉన్నామని ప్రకటించారు. ఒకటి రెండు రోజుల తర్వాత సమగ్రంగా కోర్టు ఆదేశాలను అధ్యయనం చేసి హైకోర్టు ఫుల్‌బెంచ్ లేదా సుప్రీంకోర్టుకు వెళ్లాలని భావించారు. ఇంకా ఈ ప్రక్రియ సిద్దరామయ్య ప్రారంభించలేదు. ఈలోగానే ప్రజాప్రతినిధుల కోర్టు మైసూరు లోకాయుక్తను ముడా కేసు విచారణ ప్రారంభించుకోవచ్చని బుధవారం ప్రకటించింది. లోకాయుక్త ఏ విధంగానైనా విచారణ జరపవచ్చనే సంకేతాలు రావడంతో, ఎప్పుడు విచారణకు రమ్మంటారోననే ఉత్కంఠ సిద్దరామయ్యలో నెలకొంది. మరోవైపు విచారణకు ముందే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయనుంది. ముఖ్యమంత్రిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి విచారణకు ఆహ్వానిస్తే అత్యంత కీలకమైన హోదాలో ఉండే సిద్దరామయ్యకు ఇది కోలుకోలేని పరిణామం కానుంది.

40 ఏళ్ల రాజకీయంలో ఇదే భారీ షాక్

సిద్దరామయ్య రాజకీయం నాలుగు దశాబ్దాలు సాగింది. పార్టీ ఫిరాయింపులు, ప్రత్యర్థులపై పోరాటాలు ఉంటి అంశాలను దీటుగా ఎదుర్కొన్నారు. 2013 నుంచి 2018 దాకా ఐదేళ్లపాటు సుదీర్ఘకాలం తర్వాత ముఖ్యమంత్రిగా వ్యవహరించింది సిద్దరామయ్యనే. ఈ నేపథ్యంలో ఆయనను తప్పించుకునేందుకు సొంతపార్టీలోనే కుట్రల సాగాయి. వలస, మూల వర్గాలనే భిన్నాభిప్రాయాలు తెరపైకి వచ్చాయి. దళిత సీఎం అంటూ కూడా పలు సందర్భాలలో వివాదాలు తారస్థాయికి చేరాయి. అయితే వాటన్నికంటే భిన్నంగా ఏకంగా సీఎం సిద్దరామయ్యపైనే కోర్టు కేసు నమోదు కావడం, స్వయంగా ఎదుర్కోనాల్సి రావడం, నైతికతకు ఏ విధంగా ప్రాధాన్యం ఇస్తారనేది వేచి చూడాల్సి ఉంటుంది.

కేవియట్‌కు ప్రత్యర్థులు

సిద్దరామయ్యను కట్టడి చేసేందుకు ప్రత్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్‌కు వినతులు ఇచ్చిన టీజే అబ్రహం, స్నేహమయికృష్ణ ముందుగానే కేవియట్‌కు వెళ్లేందుకు సంసిద్ధమయ్యారు. వారు కేవియట్ దాఖలు చేస్తే సిద్దరామయ్యకు న్యాయపరమైన చిక్కులు మరింత ఎక్కువ కానున్నాయని తెలుస్తోంది.

గతంలో గవర్నర్‌కు వ్యతిరేకంగా నిరసనలు

ముడా వివాదంలో సీఎంకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారని గవర్నర్ తీరును ఖండిస్తూ నిరసనలు చేశారు. చలో రాజ్‌భవన్‌తో పాటు రాష్ట్రమంతటా ఆందోళనలు, కేబినెట్‌లో గవర్నర్ తీర్మానానికి వ్యతిరేకంగా నిర్ణయం వంటి చర్యలు కొనసాగించారు. ప్రస్తుతం హైకోర్టు తీర్పు కావడంతో కాంగ్రెస్‌కు ఆందోళన చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రజాప్రతినిధుల కోర్టు సైతం వెంటనే స్పందించడంతో సీఎం సహా కాంగ్రెస్ వర్గాలకు షాక్ ఇచ్చినట్టయ్యింది. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర సారథ్యంలో సీఎం రాజీనామా కోరుతూ ఆయన నివాసం ముట్టడికి ప్రయత్నించారు. మరోవైపు మైసూరులో జేడీఎస్ లోకాయుక్త కార్యాలయానికి కోర్టు తీర్పు ప్రతులను సమర్పించి వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బెంగళూరు ఫ్రీడం పార్కులో జేడీఎస్ ముఖ్య నాయకులు రమేశ్, శరవణ ఆధ్వర్యంలో సీఎం రాజీనామా కోరుతూ నిరసన చేపట్టారు. బీజేపీ గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే సిద్దరామయ్యకు మద్దతుగా అక్టోబరు 3 నుంచి 'అహింద' వర్గాలు ఆందోళనలు చేయదలిచాయి.

సీఎం రాజీనామా చేయాలి: మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే

సీఎం రాజీనామా చేయడం సముచితమని మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. మంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పును గౌరవించి రాజీనామా చేయాలన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రిపై ఆరోపణలు వచ్చిన వెంటనే రాజీనామా చేసిన ఉదాహరణను గుర్తు చేశారు. అయితే బీజేపీ రెబెల్‌నేత ఈశ్వరప్ప శివమొగ్గలో మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్యకు న్యాయం లభించాలన్నారు. ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయం సాధించుకోవచ్చన్నారు. ఇప్పటిదాకా అధిష్ఠానం పటిష్టంగా ఉండడంతో కాంగ్రెస్ రాష్ట్ర నేతలు ఎవరూ నోరు మెదపడం లేదు. అధిష్ఠానం మౌనంగా ఉంటే ముఖ్యమంత్రి పదవికి మేము సైతం అనేవారు. నిత్యం తెరపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సీఎం వెంటనే రాజీనామా చేయాలి - ప్రతిపక్షనేత అశోక్

హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వచ్చినా కేసును ఎదుర్కొంటానని, విచారణలకు వెళ్తానని సీఎం సిద్దరామయ్య పట్టుబట్టడం సరికాదని, వెంటనే పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష నేత అశోక్ డిమాండ్ చేశారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాలు వచ్చిన వెంటనే బాధ్యతగా రాజీనామా చేయాల్సి ఉండేదన్నారు. ప్రజాప్రతినిధుల కోర్టు విచారణకు లోకాయుక్త మార్గదర్శకం నిర్దేశం చేసిన తర్వాత కూడా మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు.



బీజేపీ ఆధ్వర్యంలో నిరసన



ఫ్రీడం పార్కులో జేడీఎస్ నిరసన



ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ఏఐ సాంకేతికత..!

- నగరంలో రద్దీని బట్టి ఆటోమేటిక్ గ్రీన్‌సిగ్నల్
- 41 కూడళ్లలో అందుబాటులోకి
- మరో 124 చోట్ల కార్యాచరణ

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఐటీ నగరి బెంగళూరులో ఒక ప్రాంతం నుంచి మరో చోటుకు వెళ్లి రావాలంటే ఒకరోజు గడుస్తుందని పైగా ట్రాఫిక్‌లో ఇరుక్కుంటే ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం కూడా ఉండదనే ఆరోపణలు దశాబ్దాలుగా ఉంది. దక్షిణభారత్ వాసులేకాకుండా దేశవ్యాప్తంగా బెంగళూరు ట్రాఫిక్ అంటే బెంబేలెత్తాల్సిందేననే అభిప్రాయాలు వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. నగరంలో ప్రతిరోజూ దాదాపు ఒకే విధంగా రద్దీ ఉంటుంది. ఉదయం 8 నుంచి 11 గంటల దాకా రద్దీ ఎక్కువగాను, సాయంత్రం 3 నుంచి రాత్రి 9 గంటల దాకా ప్రతిరోడ్డు ట్రాఫిక్‌తోనే కనిపిస్తుంది. ఇక కీలకమైన హెబ్బాళ జంక్షన్, టిన్ ఫ్యాక్టరీ, డెయిరీ సర్కిల్, మడివాళ, మైసూరు రోడ్డు వంటి ప్రాంతాలలో ఒక్కోసారి గంటల తరబడి సిగ్నల్స్‌లోనే పడిగాలపులు కాయాల్సి వస్తుంది. నగరానికి జాతీయస్థాయి నేతలు సందర్శించినా, జాతీయ అంతర్జాతీయ స్థాయి సభలు, చర్చాగోష్ఠులు వేదిక ఏదైనా నగరంలో ట్రాఫిక్ సమస్యను ప్రస్తావిస్తుంటారు. పూర్తిగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదని తాత్కాలికంగా ఉపశమనం కలిగించేలాంటి విధానాలు తీసుకురావాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు దేశంలోని ప్రధాన నగరాలతో పాటు అంతర్జాతీయస్థాయి నగరాలలో రద్దీ నియంత్రణపై అవగాహన పొందారు.

- నగరంలోని ప్రముఖ సర్కిళ్లు, కూడళ్లలో సిగ్నల్స్ సమగ్రంగా నిర్వహించకపోవడమే ట్రాఫిక్ సమస్యకు కారణమని పోలీసు అధికారులు భావించారు. ప్రతి సిగ్నల్‌లోనే కాల పరిమితి ఏర్పాటు చేయడం ద్వారా ఓవైపు రద్దీ ఉన్నా, మరోవైపు ఖాళీగా ఉండే పరిస్థితి కొనసాగుతోంది. అందుకే ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగించుకుని రోడ్లపై వాహనాల రద్దీకి అనుగుణంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్)ను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఏటీసీఎస్ ద్వారా ట్రాఫిక్ రద్దీ నియంత్రణ సాధ్యమనే అభిప్రాయానికి వచ్చిన తర్వాత బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు, భూ ఉపరితల మంత్రిత్వశాఖలు అమలుకు సిద్ధమయ్యాయి. ఐటి సిటీ, ఉద్యాననగరిగా పేరొందిన నగరంలో ట్రాఫిక్ నియంత్రణకోసం రింగ్‌రోడ్లు, ప్రముఖ రోడ్ల వెడల్పు, సర్కిళ్లలో పర్యవేక్షణ వంటివి అమలు చేయదలిచారు.
- పాత సిగ్నల్స్ నిర్వహణ సాధారణ పద్ధతిలో సమయాన్ని నిర్ణయించారు. ఉదయం నుంచి రాత్రిదాకా ఒకే విధమైన సమయం నిర్ధారించడంతో కొన్ని రోడ్లు రద్దీగా ఉన్నా మరికొన్ని రోడ్లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఇదే నగరంలో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. గ్రీన్‌సిగ్నల్ కోసం నిమిషాలకొలదీ వేచి ఉండే వాహనదారులు సెకన్లలో జంప్ కావాలని వేగంగా దూసుకెళ్తున్న సందర్భంలో ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

క ఏఐ ఆధారిత స్మార్ట్ సిగ్నల్స్‌లో వెహికల్ యాక్చువేటెడ్ సిస్టమ్‌ను (వీఏసీ)ని అమలు చేయదలిచారు. ఈ సిగ్నల్ అందుబాటులోకి వచ్చాక రద్దీని పర్యవేక్షించి నిర్ణయించిన సమయంతో సంబంధం లేకుండా సిగ్నల్ నిర్వహణ సాధ్యం చేయనుంది. వరుసగా ఆగివున్న వాహనాల రద్దీని కెమెరాల ద్వారా ఏటీసీఎస్ వ్యవస్థ సేకరించి గ్రీన్‌సిగ్నల్‌ను ఇవ్వనుంది. తద్వారా కూడళ్లలో ఎక్కువ సమయం వేచివుండాల్సిన పనిలేకుండా కట్టడి చేసినట్టు అవుతుంది. తక్కువ సమయంలోనే ఒక కూడలి నుంచి మరో కూడలికి వెళ్లేందుకు కొత్త సాంకేతికత సాధ్యం కానుంది.

- రూ.53 కోట్లతో నగరంలోని 165 సిగ్నళ్లలో ఏటీసీఎస్ సాంకేతికత ఆధారిత సిగ్నల్ వ్యవస్థను రూపొందిస్తున్నారు. లాగూర్ పార్క్ జంక్షన్, వీవీపురం కాలేజ్ జంక్షన్, పై విస్టా కేఆర్ రోడ్డు, జయనగర్ 4వ బ్లాక్ మెయిన్‌రోడ్డు 40వ క్రాస్, 36వ క్రాస్‌లలో ఆధునిక సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రదేశాల సిగ్నల్స్‌ను అమలు చేస్తున్నారు. 165 సిగ్నళ్లలో ఏటీసీఎస్ వ్యవస్థను అమర్చడం, పర్యవేక్షించే బాధ్యతను సి-డాక్ కంపెనీకి అప్పగించారు. కంపెనీ అధికారులు టెక్నీషియన్‌లు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతానికి 41 సిగ్నళ్లలో ఏఐ సాంకేతికత అమలులోకి రాగా 124 సిగ్నల్స్‌లో ప్రక్రియ కొనసాగుతోంది.

నగరంలో కోటి దాటిన వాహనాలు

2023 డిసెంబరు నాటికి ద్విచక్రవాహనాలు 75,77,541, చిన్న వాహనాలు 23,51,437, ఆటో రిక్షాలు 3,19,111, భారీ సరుకు వాహనాలు 2,27,303, ఇతర వాహనాలు 6,41,996 మొత్తం 1,14,28,331 వాహనాలు ఉన్నాయి.

ఏటీసీఎస్ కార్యనిర్వహణ ఇలా...

సిగ్నల్స్ వద్ద బారులుదీరే వాహనాలను గుర్తించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే సాంకేతికమే ఏటీసీఎస్. ఇది 24 గంటలపాటు పనిచేయనుంది. సర్కిళ్లలోని అన్ని వైపులనుంచి వచ్చేవాహనాలను ఏఐ కెమెరాలు ఏటీసీఎస్ వ్యవస్థకు పంపుతాయి. ఏవైపునుంచి ఎక్కువ వాహనాలు ఉన్నాయో ఆ మార్గానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. తొలుత ఖాళీ అయిన తర్వాత రెడ్ సిగ్నల్ పడనుంది. కేవలం ఒక సర్కిల్‌లో మాత్రమే ఈ విధానం పరిమితం కాకుండా ఒక కూడలి నుంచి మరో సర్కిల్‌కు అనుసంధానం అయ్యేందుకు వాహనాల రద్దీని సిగ్నల్ ద్వారా నిర్వహణ చేయనుంది. తద్వారా రద్దీగా ఉండే చోట్లలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వీలుంటుంది. ఏఐ పరిజ్ఞానం నగరవ్యాప్తంగా డిసెంబరు ఆఖరుకు అమలులోకి తీసుకురాదలిచినట్టు జాయింట్ పోలీస్ కమిషనర్ అనుచేత్ తెలిపారు.

ఉత్తమ పౌరులుగా రాణించండి

- రామయ్య స్నాతకోత్సవంలో అప్రమేయ రాధాకృష్ణ

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలు పూర్తి చేయడంతోనే సరిపోదని నిరంతరం కొత్త అంశాలను తెలుసుకోవాలని, సాంకేతికత విషయంలో పరిణితి పొందాలని దేశాన్ని ప్రేమించే ఉత్తమపౌరులుగా రాణించాలని 'కూ', ట్యాక్సీ ఫర్ స్యూర్ ఫౌండర్ అప్రమేయ రాధాకృష్ణ అన్నారు. రామయ్య యూనివర్సిటీ 28వ స్నాతకోత్సవం బుధవారం జరిగింది. ముఖ్యులుగా పాల్గొన్న రాధాకృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఖాళీ చేతులతో పరిశ్రమను ప్రారంభించానని అదే జాదూగా మారిందన్నారు. కూ యాప్ ద్వారా లక్షలాది మందికి చేరువయ్యామన్నారు. నిరంతర శ్రమ, సమగ్రమైన ఆలోచన, సమాజానికి అనుగుణమైన నిర్ణయాలతో ముందుకెళితే భవిష్యత్తు సాధ్యమన్నారు. ఆధునిక యుగంలో స్టార్టప్‌లకు తిరుగులేదన్నారు. విద్యార్థులు ఉద్యోగాలకంటే పరిశోధనలు, ఆవిష్కరణలవైపు దృష్టి సారించాలని విపులమైన అవకాశాలు ఉన్నాయన్నారు. మేనేజ్‌మెంట్ డిప్లమోలో 292 మందికి పట్టాలను ప్రదానం చేశారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కరిసిద్దప్ప అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ రామయ్య దూరదృష్టితో విద్యాసంస్థలు ప్రారంభించారని, లక్షలాదిమందికి ఉన్నత విద్య సాధ్యమైందన్నారు. రామయ్య ఓ సాధకుడని కొనియాడారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇంజనీరింగ్ అండ్ జనరల్ సైన్సెస్ ముఖ్య అధికారి డాక్టర్ హెచ్‌వీ పార్శ్వనాథ్, జీవీఎఫ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజాసాబ్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ మానస నాగభూషణం, ఎవాల్యుయేషన్ రిజిస్ట్రార్ సవితారాణి రామచంద్ర పాల్గొన్నారు. ఉత్తమ మార్కులు సాధించినవారికి బంగారు, వెండి పతకాలను అందించారు. మనీషా ఏ గౌడకు బంగారుపతకంతో సత్కరించారు.



పట్టాల ప్రదానంలో కూ ఫౌండర్ అప్రమేయ రాధాకృష్ణ తదితరులు

ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో గణనీయ ప్రగతి

- ఏఎఫ్‌ఎస్‌టీఐ బెంగళూరు చాప్టర్ చైర్మన్ డాక్టర్ సురేషా

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నామని ఏఎఫ్‌ఎస్‌టీఐ బెంగళూరు చాప్టర్ చైర్మన్ డాక్టర్ సురేషా అన్నారు. బెంగళూరు ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఎఫ్‌ఐ ఇండియా, ప్రొ-ప్యాక్ ఇండియా సంయుక్తంగా ఆహార పదార్థాల సంస్కరణ, ప్యాకేజింగ్‌లకు సంబంధించి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎఫ్‌ఐ ఇండియా 18వ, ప్రొ-ప్యాక్ ఆరో విడత ప్రదర్శనలలో జాతీయ, అంతర్జాతీయ ఎగ్జిబిటర్స్ భాగస్వామ్యులయ్యారు. 17వేల మందికిపైగా ఆహార ఉత్పత్తుల సంస్కరణలు ఎగుమతుల విభాగానికి సంబంధించిన వ్యాపార నిపుణులు భాగస్వాములయ్యారు. విశ్వప్యాకేజింగ్ సంస్థ రాయబారి చక్రవర్తితోపాటు బెంగళూరు చాప్టర్ ముఖ్యులు నీలేశ్ లెలె, చిన్నతరహా పరిశ్రమల చాంబర్ ముఖ్యులు ప్రబోధ్ హెల్డేతోపాటు పలువురు పాల్గొన్నారు. సురేషా మాట్లాడుతూ 2030 నాటికి భారత్ పాల ఉత్పత్తిలో 230 మిలియన్ మెట్రిక్ టన్నులనుంచి 300 టన్నులకు పెరగనుందన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలోనూ గణీయమైన ప్రగతి సాధ్యమవుతోందన్నారు. మాంసం ఉత్పత్తిలో రెండో అతిపెద్దదేశంగా మారుతోందన్నారు. వివిధ విభాగాల్లో రాణించినవారికి ఉత్తమ పురస్కారాలతో సన్మానం చేశారు.



ప్రదర్శన ప్రారంభంలో ఇరు సంస్థల ముఖ్యులు

ఆరోగ్యరంగంలో గొప్ప మార్పులు

- మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో డీసీఎం

మహదేవపుర, సెప్టెంబరు 25: రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా ఆరోగ్యరంగంలో మెడికవర్ సంస్థ గొప్ప మార్పు తెస్తోందని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. వైట్‌ఫీల్డ్‌లోని హూడి సమీపంలో ఏర్పాటైన మెడికవర్ ఆసుపత్రిని డీసీఎం డీకే శివకుమార్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు, స్థానిక ఎమ్మెల్యే మంజుళా లింబావళి, బీజేపీ అధ్యక్షుడు ఎస్.ఎ.హరీస్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం డీసీఎం మాట్లాడుతూ మెడికవర్ సంస్థ 24 ఆసుపత్రులతో వందలాదిమందికి ఉపాధి కల్పించడంతోపాటు మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని ప్రశంసించారు. ఆధునిక సౌకర్యాలు కల్గిఉండడం ప్రత్యేకతగా ఉందని, సంస్థకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. 300 పడకల సామర్థ్యంతోపాటు క్యాథ్‌ల్యాబ్, 3డి ఎంఆర్ఐ, సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే ఇతర సేవలు ఉన్నాయని మెడికవర్ గ్రూప్ ఆసుపత్రుల అధ్యక్షుడు, ఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ తెలిపారు. కొత్త ఆసుపత్రితో దేశవ్యాప్తంగా తమ ఆసుపత్రులలో పడకల సామర్థ్యం 6వేలకు పెరిగిందన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో తొలి ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో మొత్తం 24 ఆసుపత్రులలో అనుభవజ్ఞులైన వైద్యులతో చికిత్సలు అందిస్తున్నామన్నారు. రానున్న మూడు నాలుగేళ్లలో బెంగళూరులో 4-5 కొత్త ఆసుపత్రులు నిర్మించే ఆలోచన ఉందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి ప్రముఖులు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శరత్‌రెడ్డి, రక్షిత్, పాలలోచన, డాక్టర్ కృష్ణప్రసాద్, ఐఏఎస్ అధికారి రాజేంద్ర సోలన్ తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్


కేరళ డ్రైవర్ అర్జున్‌తోపాటు లారీ వెలికితీత

- శిరూరు గుట్ట కుంగిన ప్రమాదంలో...

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా శిరూరు ప్రాంతంలో భారీ వర్షాలతో గుట్ట కుంగిన ప్రమాదంలో గంగావళి నదిలో కొట్టుకుపోయిన లారీతోపాటు డ్రైవర్ అర్జున్‌ను బయటకు తీశారు. భారత్‌బెంజ్ కంపెనీ లారీలో కుళ్లిపోయిన తరహాలో లారీ డ్రైవర్ అర్జున్ మృతదేహాన్ని గుర్తించామని జిల్లా ఎస్పీ ఎం నారాయణ బుధవారం ప్రకటించారు. శిరూరుగుట్ట ప్రమాదం జూలై 16న జరిగింది. లారీలో కలపదుంగలను రవాణా చేస్తుండగా ప్రమాదంలో డ్రైవర్ అర్జున్‌తోపాటు లారీ నదిలో కొట్టుకుపోయింది. 71 రోజుల తర్వాత లారీని ఎట్టకేలకు గుర్తించారు. అర్జున్ ఆచూకీకోసం కేరళ ప్రభుత్వం గాలింపు చర్యలు కొనసాగించాలని సూచించిన విషయం తెలిసిందే. ప్రమాదంలో 11మంది మృతి చెందగా 9 మంది మృతదేహాలను గుర్తించారు. శిరూరుకు చెందిన జగన్నాథనాయక, గంగాకొళ్లకు చెందిన లోకేశ్‌నాయకల ఆచూకీ ఇంకా లభించలేదు.



లారీని వెలికితీస్తున్న దృశ్యం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.94	1,619.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,980	3,455
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,153	9,885
సామర్థ్యం (టీఎంసీలు)	101.54	60.91

సీఎం రాజీనామాకు బీజేపీ పట్టు

కార్యకర్తల నిరసనతో అట్టుడికిన బళ్లారి, రాయచూరు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 25 : సీఎం సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని కోరుతూ బళ్లారి, రాయచూరులలో బీజేపీ శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేశాయి. వారి నిరసన ప్రదర్శనలతో నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నగరం రాయల్ సర్కిల్ సమీపంలో బీజేపీ నాయకులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వైఎంసతీష్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు మోకా అనిల్‌కుమార్ నాయుడు, డాక్టర్ అరుణ కామినేని, మారుతీప్రసాద్, పుష్ప హనుమంతప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బీజేపీ ధర్నా

రాయచూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) అవినీతికి సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప డిమాండ్ చేశారు. న్యాయస్థానంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిటీషన్ తిరస్కరణకు గురికావడంతో ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ ఇచ్చిన అనుమతి రాజ్యాంగబద్ధమేనని స్పష్టమైందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి అనైతికంగా పదవిలోనే కొనసాగడాన్ని తప్పుబట్టిన బీజేపీ శ్రేణులు అందుకు వ్యతిరేకంగా బుధవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఈ సందర్భంగా మాట్లాడిన శంకరప్ప గతంలో ఇదే విధంగా గవర్నర్ సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతించగా అప్పటి సీఎం యడియూరప్ప పదవి నుంచి తప్పుకుని న్యాయస్థానం పట్ల గౌరవాన్ని చాటారన్నారు. అదే పద్ధతిలో సిద్ధరామయ్య సహితం పదవిని వీడి న్యాయస్థానానికి సహకరించాలన్నారు.



బళ్లారి రైస్ సర్కిల్‌లో బీజేపీ నాయకుల ఆందోళన



రాయచూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ శ్రేణులు

కౌన్సిలర్ మహేష్ సస్పెన్షన్

● పార్టీ సభ్యత్వం రద్దు,

● కౌన్సిల్ సభ్యత్వం రద్దుకు డీసీకి సిఫార్సు



బళ్లారి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హొస్పేట్ పురసభ ఎన్నికల్లో ఓటింగ్‌కు హాజర కాలేదనే కారణంతో కాంగ్రెస్ పార్టీ నుండి కౌన్సిలర్ కారంపొడి మహేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరాజ్ షేక్ తెలిపారు. అలాగే మహేష్‌ను కౌన్సిలర్ పదవి నుండి కూడా సస్పెండ్ చేయడానికి కలెక్టర్‌కు సిఫార్సు చేసినట్లు తెలిపారు. సెప్టెంబరు 12న హొస్పేట్ మున్సిపల్ అధ్యక్షపదవికి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటింగ్‌కు కాంగ్రెస్ నుండి మహేష్ గైరాజరయ్యారు. దీని ఫలితంగా కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికకావల్సిన మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు ఎన్నిక కాలేక పోయారు. బీజేపీ అధ్యక్షపదవిని గెలుచుకుంది. మహేష్ రాజకీయ దురుద్దేశంతోనే గైరాజరయ్యారని పార్టీ పసిగట్టినట్లు తెలిపారు.

నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటాను- మహేష్

'మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షపదవిని ఆశించాను. కానీ కొందరు నన్ను మోసం చేశారు. అయినా నేను పార్టీకి ద్రోహం చేయలేదు, మున్సిపల్ అధ్యక్ష ఎన్నికల రోజు నా ఆరోగ్యం బాగలేదు. అందుకే ఓటు వేయలేక పోయాను' అని మహేష్ పేర్కొన్నారు.

నేడు అక్కినేని కళా పురస్కారాలు

బళ్లారి సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు 101 జయంతి సందర్భంగా గురువారం రాఘవ కళామందిరం సంగీతహాల్‌లో కళాసేవా పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమతా సాహితీ ట్రస్ట్ తెలిపింది. గురువారం సాయంత్రం 6 గంటలకు రాఘవ మెమోరియల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చెన్నప్ప జ్యోతిని వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. ప్రముఖ రంగస్థల కళాకారులు, ప్రముఖ గాయకులు, అయిన కే. రవీంద్రనాథ్, జోయిస్ వెంకోబాచార్, జెటీ ప్రవీణ్ కుమార్, చల్లా అమరేంద్రనాథ్ చౌదరి, బి. గంగణ్ణ, ఎం. శ్రీనివాసులు, కే. కాళిదాస్, లాల్‌రెడ్డి, వలి అమ్మద్, నేతి రఘురాములు, టి. నాగభూషణం, పీఎం నటరాజ్, జి, వెంకటేశులకు కళాసేవ పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎన్నిక



యోగసనాలు వేస్తున్న విద్యార్థిని నిహారిక

గంగావతి రూరల్, సెప్టెంబరు 25: చిన్నతనం నుండే ప్రతి విద్యార్థి యోగ, ధ్యానం లాంటివి అభ్యసిస్తే ఉత్తమ ఆరోగ్యంతో పాటు జ్ఞాపక శక్తి పెంచుకోవచ్చని లిటిల్ హార్ట్స్ పాఠశాల హెడ్‌మాస్టర్ ప్రియా కుమారి అభిప్రాయ పడ్డారు. కొప్పళ జిల్లా పరిధిలోని కుష్టిగి విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన యోగాసన పోటీల్లో లిటిల్ హార్ట్స్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని నిహారిక ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎన్నికైనట్లు తెలిపారు. రాష్ట్ర యోగా పోటీలకు ఎన్నికైన నిహారికకు పాఠశాల కార్యదర్శి జగన్నాథ్ అలంపల్లి, పాఠశాల అధ్యాపకబృందం, ఉపాధ్యాయులు సోమశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతా అభియాన్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25: నగరంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బళ్లారి కర్ణాటక గ్రామీణ బ్యాంక్ పరిశుభ్రత జాతాను ఏర్పాటు చేసింది. సుమారు 150మంది సిబ్బంది నగరంలోని ప్రధాన కార్యాలయం నుండి జాతాగా బయలు దేరి నగరంలోని ప్రముఖ వీధులగుండా జాతా నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంక్ అధ్యక్షులు దిల్లి బాబు మాట్లాడారు. శుభ్రత అనేది మన నిత్య జీవితంలో ఒక భాగమని, దీనిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రముఖులు, ప్రాదేశిక సిబ్బంది, నగరశాఖ సిబ్బంది ఉత్సాహంతో పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సలహాలు ఇవ్వాలి

● పరిశోధనా ఫలాలు రైతులకు అందాలన్న ఎమ్మెల్సీ

● వ్యవసాయ వర్సిటీలో ఉత్సాహంగా రబీ విత్తనోత్సవం

రాయచూరు సెప్టెంబరు 25 : వ్యవసాయంలో కొత్తగా చేసిన పరిశోధనలు, అనుసరించే విధానాలు, పద్ధతులపై రైతులకు సకాలంలో సరైన సలహాలు ఇవ్వాలని రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయ వ్యవస్థాపక సభ్యుడు ఎమ్మెల్సీ శరణగౌడ బయ్యాపూర్ సూచించారు. అదే సమయంలో సాగులో మేలైన విత్తన రకాలను ఎంచుకోవడం ద్వారా రైతులు మరింత లాభసాటిగా పంటలను సాగుచేయాలని సూచించారు. రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం బుధవారం రబీ సీజన్-2024కు విత్తన మహోత్సవం నిర్వహించింది. ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ శరణగౌడ బయ్యాపూర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకనుగుణంగా ఎప్పటికప్పుడు నూతన వంగడాలను తీసుకురావల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ విషయంలో విశ్వ విద్యాలయం పరిశోధన విభాగం మరింతగా కృషి చేయాలన్నారు. మరో వ్యవస్థాపక సభ్యుడు మాజీ ఎమ్మెల్యే బసనగౌడ బ్యాగవాట్ మాట్లాడుతూ రైతులు అత్యంత శక్తివంతులని ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదన్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన భారతీయ విత్తన విజ్ఞాన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిశోధనలలో తనదైన ప్రగతిని సాధిస్తుండడం అభినందనీయమన్నారు. సాగు విషయంలో ఎదురయ్యే సవాళ్లను రైతులు వ్యవసాయ విజ్ఞాన శాస్త్రవేత్తల సలహాతో అధిగమించాలన్నారు. ఈ విషయంలో రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు విత్తన పరిశోధన సంస్థలు అందుబాటులో ఉంటాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉపకులపతి తమ విశ్వ విద్యాలయంలో సాగుతున్న పరిశోధనలు అందుబాటులో ఉన్న వంగడాలు ఇప్పటి వరకు రైతులకు తమ విశ్వ విద్యాలయం ద్వారా అందుతున్న సహాయ సహకారాల గురించి వివరించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ శరణగౌడ బయ్యాపూర్



విత్తన స్టాళ్లను తిలకిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

వసతి పాఠశాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర్

కంప్లి, సెప్టెంబరు 25 : విజయనగర జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ ఆకస్మికంగా హగరి బొమ్మన హళ్లి తాలుకా లోని వల్లభాపుర మొరార్జీ దేశాయ్ వసతి పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులకు ఆహారం, నీరు, స్నానానికి వేడి నీరు, సోప్స్, బ్రష్‌లు తదితర మౌలిక సదుపాయాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సరియైన సమయానికి వస్తున్నారా? లేదా అని ప్రశ్నించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు చేసే బోధన జీవిత కాలం నిలిచిపోతుందన్నారు. ఆస్తి అంతస్తుల కన్నా విద్య గొప్పది కావున విద్యార్థుల దృష్టిలో ఎప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోయేలా బోధించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అలాగే హాస్టల్‌లో కూడా ప్రభుత్వం అందించే సౌకర్యాలను సక్రమంగా అందించి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్వచ్ఛతకు ముందుకు రావాలి



హంపిలో స్వచ్ఛతా పనుల్లో సీఈవో అలీ అక్రమ్ షా

కంప్లి, సెప్టెంబరు 25: రాష్ట్రంలో పర్యాటక కేంద్రంలో ఒకటైన హంపి పుణ్యక్షేత్రంలో ప్రతి పర్యాటకుడు తిరిగే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టి హంపి పుణ్యక్షేత్ర స్వచ్ఛతను కాపాడాలని విజయనగర జిల్లా సీఈవో మహమ్మద్ అలీ అక్రమ్ షా తెలిపారు. ఇందుకోసం హంపిలో పురాతత్వ శాఖ, వివిధ సంఘ సంస్థ నేతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రెండు మూడు రోజులుగా నవదిబ్బ, గజశాల, ఎదురు బసవన్న, విజయ విఠల దేవస్థానం, పలు చోట్ల పర్యాటకులు తిరిగే ప్రదేశాలలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. హంపి పుణ్యక్షేత్రానికి వచ్చే పర్యాటకులను స్వచ్ఛత ఆకట్టుకునేలా వుండాలని తెలిపారు. తమ ఇళ్లను పరిశుభ్రంగా ఎలా వుంచుకుంటారో పుణ్యక్షేత్రాల్లోని స్థలాలను కూడా అలా వుంచుకునేలా చూడాలన్నారు.

చివరి ఆయకట్టుకు నీటి రాక

సిరుగుప్ప, సెప్టెంబరు 25 : సిరుగుప్ప తాలుకాలో భాగవడే చివరి ఆయకట్టు భూములకు ఈ యేడాది సాగునీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో కాలువలకు నీరు ప్రవహించడంతో రెండు పంటలు పండించుకోవచ్చునని ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆడపిల్లలు ఆకర్షణలో పడొద్దు: ఎస్పీ

బళ్లారి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు ఆకర్షణకులోనై జీవితం కోల్పోకూడదని, మాయమాటలతో మోసపోయి జీవితం కోల్పోతే తిరిగి దాన్ని సంపాదించుకోవడం సాధ్యంకాదని బళ్లారి జిల్లా ఎస్పీ శోభారాణి సూచించారు. బీడీఏఏ హాల్‌లో రీడ్స్ ఆర్గనైజేషన్, చైల్డ్ స్పెషల్ పోలీస్ యూనిట్, జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలపై నిషేధం, లింగ వివక్షపై సదస్సు నిర్వహించారు. అంతక ముందు బళ్లారి నగరంలోని రాయల్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, విద్యాహక్కును ప్రతి యువతి, మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లలు సమాజ స్పృహతో మెలగాలని కన్నవారికి, ఉన్న ఊరికి, చదివిన పాఠశాలలకు మంచి పేరు తెచ్చి గర్వంగా తలెత్తుకునేలా ఉండాలని కోరారు. బాలల రక్షణ కోసం ప్రతి జిల్లాలో డీవైఎస్పీ, పీఎస్ఐ, మహిళా పోలీసు, కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక పోలీసు విభాగం ఉందని, బాల్య వివాహాలు, బాలికలపై వేధింపులు జరిగితే వెంటనే రంగంలోకి దిగి వేధించే వారిని కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ హెచ్చరించారు. బాలల హెల్ప్ లైన్ నంబర్ 1098, మహిళా హెల్ప్ లైన్ నంబరు 181, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నంబరు 112 ఫోన్ చేయాలని ఎస్పీ తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలే అధికంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రేమ- పెళ్లి అనే కారణంతో అమ్మాయిలు జీవితం నాశనం చేసుకోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రతి పౌరుడు సమాజంలో బాధ్యతగా మెలగాలని కోరారు. వీరిలో పాటు ఏఎస్పీ నవీన కుమార్, రైల్వే పోలీస్ అధికారిని విజయలక్ష్మి, న్యాయవాది శీలీల, డాక్టర్ మోహనకుమారి, కౌల్‌బజార్ పీసీఐ సుభాష్‌చంద్ర, గాంధీనగర్ పీసీఐ సిద్దరామేశ్వర్ కడేడ, ట్రాఫిక్ పీసీఐ అయ్యనగౌడ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి

సోమప్ప చెరువు సుందరీకరణకు చర్యలు



చెరువు సమస్యలపై అసిస్టెంట్ కమీషనర్‌కు తెలియజేస్తున్న దుర్గన్న

కంప్లి, సెప్టెంబరు 25 : కంప్లి నడిబొడ్డున వుండే సోమప్ప చెరువును ఆకట్టుకునేలా చర్యలు చేపట్టాలని పురసభ ముఖ్య అధికారి దుర్గన్న సూచించారు. బుధవారం కంప్లి తాలుకా పరిధిలోని నెంబర్ టెన్ ముద్దాపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. అలాగే సోమప్ప చెరువును కూడా పరిశీలించారు. సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే మహిళలకు వీలుగా ప్రజలకు ప్రత్యేకంగా శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రంథాలయాన్ని కూడా ప్రారంభించాలని, రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు వుండేలా చూడాలన్నారు. దీంతో పాటు చెత్తకుండీలుఏర్పాటు చేయాలని, సేద తీరడానికి కూడా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పిల్లలకు అనుగుణంగా క్రీడా పరికరాలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని సూచించారు. వారితో పాటు తహసీల్దార్ శివరాజ్, ఆర్ఐ గణేష్, పురసభ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్‌కు ఎంపికైన బెస్ట్ కాలేజీ విద్యార్థులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25: ఎ.ఎస్, ఎం.పీ యూకాలేజీలో జరిగిన జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో బెస్ట్‌కాలేజ్ విద్యార్థులైన చేతన, చైత్ర రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యారు. వీరిని సంస్థ అధ్యక్షులైన కే,రామప్ప, ఉపాధ్యక్షులు తిలక్ కుమార్, కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావ్, శ్రీనివాసరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ శివానంద్, తిప్పేరుద్రప్ప, శ్రీమతి వెంకటలక్ష్మి, అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న బెస్ట్ కాలేజ్ సంస్థ నిర్వాహకులు

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ.. శిక్షణ

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 25: మారుతున్న ఆధునిక వ్యవసాయ రంగంపై రైతులు అవగాహన పెంచుకుని వ్యవసాయంపై ఖర్చును తగ్గించుకోవాలని ఐసిఏఆర్(ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చ్) సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎన్.రమేష్ రైతులకు పిలుపునిచ్చారు. భారతీయ మట్టి, జల సంరక్షణా సంస్థ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం సోమసముద్రం, లక్ష్మీనగర్ తదితర గ్రామాల్లో డ్రోన్ సాయంతో పొలాల్లో కీటక నాశనులను పిచికారి చేయడంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. మిరప, వరి, మొక్కజొన్న, పంటలకు సంబంధించి క్రిమి నాశక మందుల పిచికారి కార్యక్రమాన్ని 20 ఎకరాల్లో జరిపారు సోమసముద్రం, లక్ష్మీనగర్ క్యాంపు, కోళూరు మదరి, కృష్ణానగర్ క్యాంపు, భాగ్యనగర్ క్యాంపు, శ్రీధరగడ్డ, గ్రామాల్లో సుమారు 49మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐసిఏఆర్ సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎన్.రమేష్ మాట్లాడుతూ డ్రోన్ స్ప్రే ఉపయోగించడం ద్వారా మందుల పిచికారి కోసం కూలీలను తక్కువగా ఉపయోగించ వచ్చన్నారు. అంతేకాకుండా రసాయనిక మందుల ప్రభావం నుండి మనల్నికాపాడుకోవచ్చని, దీంతో తోడు రసాయనిక మందుల ప్రభావం పంటలపై సమానంగా పనిచేస్తుందని వివరించారు. ఇలాంటి అధునాతన డ్రోన్-స్ప్రే యంత్రాలను కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిఏఆర్ సంస్థకు చెందిన డాక్టర్ రవి దూపదాళ్, డాక్టర్ కె. ఎన్.రవి, డాక్టర్ ఎన్.ఎం. అనుషా, రైతులు పాల్గొన్నారు.



పైర్లపై మందులు పిచికారి చేస్తున్న డ్రోన్

హోసూరు జోన్

హోసూరులో రోడ్డు పనులకు శ్రీకారం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

హోసూరు సెప్టెంబరు 25: హోసూరు ప్రాంతంలో సుమారు రూ.7 కోట్లతో వివిధ చోట్ల రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే వైప్రకాశ్ భూమిపూజ నిర్వహించారు. పీఎంజీఎస్‌వీ ప్రాజెక్టు క్రింద హోసూరు పంచాయతీ యూనియన్ హోసూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని బాగలూరు, బేరికై రోడ్డు నుంచి ఆలూరు సరిహద్దు వరకు మోరనపల్లి, గౌరవపల్లి ద్వారా సుమారు విలువ రూ.73 లక్షల 64 వేలతో తార్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే తళి రోడ్డు నుంచి ఆనేకల్ కర్ణాటక సరిహద్దు వరకు దాదాపు రూ.2 లక్షల విలువైన తారురోడ్డు నిర్మాణ పనులకు వై.ప్రకాశ్, భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో హోసూరు యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, పార్లమెంట్ సభ్యురాలు మంజుళ మునిరాజ్, కొత్తకొండ పల్లి పాఠశాల పంచాయతీ అధ్యక్షురాలు సుమా మునిరాజ్, సంయుక్త ఉప కార్యదర్శి రమేశ్, యూనియన్ కమిటీ సభ్యులు త్యాగరాజన్, హరీశ్, లోకేశ్‌రెడ్డి, రాజేంద్రన్, బత్తలపల్లి దేవరాజ్, శ్రీనివాస్, పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, ప్రభుత్వ అధికారులు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలకు సీల్

హోసూరు సెప్టెంబరు 25: హోసూరులో నిషేధించిన పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలకు సీల్ వేసి కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. హోసూరు మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు పలు దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. డెంకణీకోట రోడ్డులో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణానికి రూ.1000 జరిమానా విధించి దుకాణానికి సీల్ వేశారు. తనిఖీల్లో 10 కిల్లోల నిషేదిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని రూ.10 వేలు జరిమానా విధించారు.

వ్యవసాయరంగంలో ఎన్నో సబ్సిడీ పథకాలు

హోసూరు సెప్టెంబరు 25 : వ్యవసాయరంగంలో ఎన్నో సబ్సిడీ పథకాలు ఉన్నాయని వ్యవసాయ సంచాలకులు భువనేశ్వరీ వివరంగా తెలిపారు. హోసూరులో వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర విస్తరణ పథకాల మద్దతు పథకం క్రింద వ్యవసాయ విస్తరణ కేంద్రం తరపున రైతులకు సాంకేతిక సలహ కమిటీ సమావేశం బుధవారం జరిగింది, ఈ సమావేశానికి సహాయ వ్యవసాయ సంచాలకులు భువనేశ్వరీ హాజరై ఆత్మ పథకం క్రింద విత్తనశుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు, వ్యవసాయ రంగంలోని సబ్సిడీ పథకాల గురించి రైతులకు వివరించారు. అలా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను , వ్యవసాయ రంగంల్లో అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలు, పంటల బీమా ప్రాముఖత, గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారిణి రేణుక హాజరై జిప్సం, స్ప్రేయర్ , జింక్ సల్ఫేట్ సబ్సిడీ వివరాలు, ప్రయోజనాలు, పద్ధతులు, జీవ ఎరువులు, సూక్ష్మపోషక ఎరువులువల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అలాగే ఆత్మ ప్రాజెక్టు టెక్నికల్ మేనేజర్ సుగుణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

దసరా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి



అధికారులు,ప్రజాప్రతినిధులతో సమావేశమైన నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు

రాయచూరు సెప్టెంబర్ 25 : ప్రతి ఏటా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు అనంతరం దసరా పండుగా సందర్భంగా నిర్వహించే నాడహబ్బ ఉత్సవాన్ని ఈ ఏడాది మరింత ఉత్సహంగా జరుపుకోవాలని నగరసభ అధికారులు, ప్రజాప్రతినిధులు తీర్మానించారు. దసరా ఉత్సవ నిర్వహణకు సంబంధించి బుధవారం నగరసభ ఆవరణలో ముందస్తు సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన వక్తలు రాష్ట్రంలో దసరా పండుగకున్న విశిష్టతను దృష్టిలో ఉంచుకుని నగరంలోను అదే వరవడితో నిర్వహించాలన్నారు.

ప్రతి ఏటా నగరసభ ఆధ్వర్యంలో దసరా పండుగ రోజున నిర్వహించే నాడదేవి రథోత్సవాన్ని ఈ ఏడాది మరింత ఉత్సహంగా నిర్వహించాలని తీర్మానించారు. అవసరమైతే బిచ్చాలి మఠం నుంచి ఏనుగును రప్పించి అమ్మవారిని అంబారిలో ఊరేగించేలా చర్యలు తీసుకుందామని సభలో తీర్మానించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (జయంతి)



ప్రముఖ బెంగాలీ కవి ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 1820 సెప్టెంబరు 26న పశ్చిమబెంగాల్ రాష్ట్రం బిర్సింగా గ్రామంలో జన్మించారు. విద్యావేత్త, తత్వవేత్త, పారిశ్రామికవేత్త, రచయిత, అనువాదకుడు, సమాజ సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బెంగాలీ లిపిని 1780 తర్వాత మొదటిసారి క్రమబద్ధీకరించిన ఘనత ఆయనదే. తండ్రి బాటలో సంస్కృత ఉపాధ్యాయుడిగా రాణించారు. అయితే సంస్కృత భాష అన్ని కులాల వారికి, మహిళలకు కూడా నేర్పించాలని పోరాటం చేశారు. సంస్కృత ముద్రణాలయం ఏర్పాటులో ఎంతో కృషి చేశారు. 1891 జూలై 29న కన్నుమూశారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం (జయంతి)



ప్రముఖ సంఘసంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహం 1867 సెప్టెంబరు 26న పశ్చిమగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో జన్మించారు. కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడిగా రాణించారు. 19వ శతాబ్దం చివరన, 20వ శతాబ్దం ఆరంభంలో తెలుగు సాహిత్య అభివృద్ధికి, తెలుగునాట ఆధునిక భావాల వికాసానికి పట్టుగొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. 22 ఏళ్లకే రచించిన గయోపాఖ్యానం అనే నాటకం లక్షకుపైగా ప్రతులు అమ్ముడవడం ఒక రికార్డు. నిమ్న జాతులకోసం ప్రత్యేకంగా పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్రదేశంలో ఆయనకే దక్కుతుంది. 30వ యేట రేచీకటికి గురైన శ్రమించి రచనలు చేశారు. కొద్దికాలం అష్టావధానాలు చేశారు. 1946 జూన్ 17న కన్నుమూశారు.

పాపనాశం శివన్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసుడు పాపనాశం శివన్ 1890 సెప్టెంబరు 26న తంజావూరు జిల్లా పోలగం గ్రామంలో జన్మించారు. 1930, 40 దశకాలలో కన్నడ, తమిళ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. తమిళ త్యాగరాజుగా పేరొందారు. ఆయన స్వరపరిచిన కృతులను ఎంకే త్యాగరాజ భాగవతార్, ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రచారంలోకి తెచ్చారు. కాగా దైవభక్తి కలిగిన ఈయన తరచూగా పాపనాశంలోని ఆలయానికి వెళ్లి అక్కడి భస్మాన్ని రాసుకునేవారు. దాంతో పాపనాశం శివన్‌గా పిలిచేవారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించగా, సంగీత కళానిధి, సంగీత కళా శిఖామణి, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. 1973 అక్టోబరు 1న కన్నుమూశారు.

దేవానంద్ (జయంతి)



ప్రముఖ హిందీ నటుడు దేవానంద్ 1923 సెప్టెంబరు 26న పంజాబ్ రాష్ట్రం సకార్‌గర్ ప్రాంతంలో జన్మించారు. 65ఏళ్ల సినీ కెరీర్‌లో సినీ రచయితగా, నిర్మాత, దర్శకుడిగా రాణించారు. 114 సినిమాలలో నటించారు. దేశ సినీరంగంలో విజయవంతమైన నటుడిగా గుర్తింపు పొందారు. పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2011 డిసెంబరు 3న ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు.

డాక్టర్ మన్మోహన్‌సింగ్ (పుట్టినరోజు)



దేశ ప్రధానిగా వ్యవహరించిన మన్మోహన్‌సింగ్ 1932 సెప్టెంబరు 26న పంజాబ్ రాష్ట్రం (ప్రస్తుతం పాకిస్థాన్‌లోని చక్వాల్)లో జన్మించారు. ప్రపంచంలో పేరొందిన ఆర్థికవేత్తలలో ఒకరిగా నిలిచారు. ఆర్థికశాస్త్రంలో లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేశారు. రిజర్వుబ్యాంకు డైరెక్టర్‌గా, ఆర్థికశాఖ కమిషన్ సభ్యుడిగా, ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారుల కౌన్సిల్‌లో సభ్యుడిగా, ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా వివిధ హోదాలలో వ్యవహరించారు. పద్మ విభూషణ్, ఇతర పురస్కారాలు అందుకున్నారు.

సెరెనా విలియమ్స్ (పుట్టినరోజు)



సెరెనా జమేకా విలియమ్స్ 1981 సెప్టెంబరు 26న యునైటెడ్ స్టేట్స్ మిచిగాన్ ప్రాంతంలో జన్మించారు. ప్రపంచంలో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణిగా పేరొందారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇలా అన్ని విభాగాలలో 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ అందుకున్న ఘనత ఆమెదే. ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ ప్రకటించిన 'సింగిల్స్‌లో వరల్డ్ నెంబరు1'గా 8సార్లు 2002 నుంచి 2017 వరకు నిలిచారు. 2022 సెప్టెంబరులో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఆమె అనేక చారిటీ సంస్థలకు అండగా నిలుస్తున్నారు.

అభిషేక్ రఘురాం (పుట్టినరోజు)



అభిషేక్ రఘురాం 1985 సెప్టెంబరు 26న జన్మించారు. ప్రముఖ మృదంగం కళాకారుడు పాల్ఘాట్ ఆర్ రఘు మనుమడు. కర్ణాటక గాత్ర సంగీతకారుడిగా రాణిస్తున్నారు. ఆలిండియా రేడియోలో ఏ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా ఉన్నారు. కంచికోటి కామకోటి పీఠం ఆస్థాన విద్వాన్‌గా, షణ్ముఖ సంగీత శిరోమణి పురస్కారం, తదితర పురస్కారాలు అందుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్

గుంతకల్లు, సెప్టెంబరు 25: స్థానిక రైల్వే డీజిల్ షెడ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ కోరారు. బుధవారం ఉదయం మజ్దూర్ యూనియన్ నాయకులు డీజిల్ షెడ్‌ను సందర్శించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. టూల్స్, స్పేర్స్ కొరత, ఉద్యోగులకు మౌలిక వసతుల లేమి తదితర అంశాలపై కార్మికులు సమస్యలను వివరించారు. అనంతరం యూనియన్ నాయకులు షెడ్ సీనియర్ డీఎంఈని కలిసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు.

పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం



కోడిగుడ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, సెప్టెంబరు 25: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం కల్పించేలా మధ్యాహ్న అల్పాహార పథకంలో వారానికి రెండురోజులు అందిస్తున్నట్టు కోడిగుడ్లు ఇకపై వారానికి ఆరు రోజుల పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ పిల్లలు విద్యలో వెనుకబాటుకు పౌష్టికాహార లోపమే కారణమన్నారు. ఇందుకే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారానికి రెండు కోడిగుడ్లు ఇస్తున్నారన్నారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా మిగిలిన నాలుగు రోజులూ కోడిగుడ్లు పంపిణీకి ప్రభుత్వంతో మూడేళ్ల ఒప్పందం కుదిరిందన్నారు. తద్వారా రాష్ట్రంలో 55లక్షలకుపైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. బీఈఓ వెంకటేశప్ప, తహసీల్దార్ మనీషా మహేశ్‌పత్రి, ఈఓ రమేశ్ సీఐ ప్రశాంత్ ఆర్ వర్ధి తదితరులు పాల్గొన్నారు.

కాగా పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమీనాఖానం పేర్కొన్నారు. నిడుమామిడి మఠం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పోషణ అభియాన నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయలతో ప్రత్యేక ఆకారం రూపొందించగా ఆకట్టుకుంది. టీచర్ శ్రీవాణి, అంగన్‌వాడీ కార్యకర్త సరోజమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోషణ్ అభియానలో ఇలా...

ఆక్స్‌ఫర్డ్ చైర్మన్ నరసింహరాజుకు గౌరవ డాక్టరేట్

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్ఎన్‌వి నరసింహ రాజుకు ధారవాడకు చెందిన కర్ణాటక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 74వ స్నాతకోత్సవం సందర్భంగా నగరంలోని గాంధీభవన్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, టెక్నాలజీ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ అయ్యప్పన్, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేబీ గుడసి, రిజిస్ట్రార్ ఎన్‌వై మట్టిహాళలు పాల్గొన్నారు. మంత్రి సుధాకర్ మాట్లాడుతూ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ద్వారా ఏటా వేలాదిమందికి విద్య అందుతోందన్నారు. ఆధునిక బోధనలలో నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నరసింహరాజుకు గౌరవ డాక్టరేట్ సంతోష కరమన్నారు. ఇదే సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ సంస్థల ఉద్యోగులు, అధ్యాపకులు నరసింహ రాజును ప్రత్యేకంగా సత్కరించారు.



నరసింహరాజుకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్

మృత బాలుడి కుటుంబానికి చేయూత

▸▸ బీబీఎంపీ, బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ క్రీడామైదానంలో గేట్ నుంచి కిందపడి మృతి చెందిన బాలుడు నిరంజన్ కుటుంబానికి డీసీఎం డీకే శివకుమార్ పరామర్శించారు. బుధవారం మల్లేశ్వరంలోని బాలుడి నివాసానికి డీసీఎం డీకే శివకుమార్, ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు వెళ్లి రూ.10లక్షల పరిహారం అందించారు. అనంతరం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ బీబీఎంపీ తరపున రూ.5లక్షలు, బ్లాక్ కాంగ్రెస్ తరపున రూ.5 లక్షలు మొత్తం రూ.10లక్షలు అందచేశామన్నారు. కాగా మృతి చెందిన బాలుడి నేత్రాలను దానం చేయడం ద్వారా కుటుంబీకుల వైఖరిని ప్రశంసించారు. పేదరికం ఉన్నా బాలుడి కుటుంబం మాదిరిగా వ్యవహరించారన్నారు. కుమారుడిని కోల్పోయిన కుటుంబానికి బాధను భరించేశక్తి భగవంతుడి ఇవ్వాలని ఆకాంక్షించామన్నారు. దినేశ్ గుండూరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలుడి సోదరుడి విద్యాభ్యాసానికి చేయూత ఇవ్వనున్నట్టు తెలిపారు. మానవతా దృష్టితో సాయం చేస్తున్నామన్నారు. ఘటనపై నివేదిక వచ్చాక తీర్మానం తీసుకుంటామన్నారు. బెంగళూరులోని వేర్వేరు చోట్ల గేట్లను పరిశీలిస్తామన్నారు.



చెక్కు అందజేస్తున్న డీసీఎం డీకే శివకుమార్, మంత్రి దినేశ్ గుండూరావు

ముఖ్యమంత్రి మార్పు మీడియా సృష్టి

బంగారపేట, సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి మార్పు అనేది మీడియాలో వచ్చిన ఊహాజనితమైన సృష్టి అని ఎమ్మెల్యే, కేయూడీఎఫ్‌సీ అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. తాలూకాలోని ఎస్ఎన్‌సిటీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముడా వివాదంలో కోర్టు తీర్పుతో భయపడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ హైకమాండ్‌తోపాటు 136మంది ఎమ్మెల్యేలు, మంత్రులు సీఎంకు అండగా ఉన్నారన్నారు. రాజ్‌భవన్, సీబీఐ, ఇతర దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కాగా వివాదానికి సంబంధించి సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారన్నారు. రాష్ట్రంలో గత బీజేపీ పాలనలో సాగిన కోవిడ్, బోవి మండలి, దేవరాజ్ అరసు టర్మినల్ తదితర అంశాలలో సాగిన అక్రమాలపై కాంగ్రెస్ పోరాటం చేయనుందన్నారు.



మీడియాతో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

అన్నదాతలకు అండగా సహకార సంఘాలు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 25: సహకార సంఘాలు అన్నదాతలకు అండగా ఉన్నాయని మళమాచనహళ్లి పాల ఉత్పత్తిదారుల సంహకార సంఘం ఎంపీసీఎస్ అధ్యక్షుడు రామచంద్ర చారి అభిప్రాయపడ్డారు. పాడిరైతులు నాణ్యమైన పాలను సరఫరా చేయడంతోనే సహకార సంఘాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 2023-24 వార్షిక సర్వసభ్య సభను సంఘం ఆవరణలో నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రామచంద్రాచారి మాట్లాడుతూ రూ.14.09 లక్షల నికర లాభం గడించినట్టు తెలిపారు. లాభాలలో 1.66శాతం సుమారు రూ.6.02 లక్షలు ఉత్పత్తిదారులకు బోనస్‌గా ఇవ్వనున్నట్టు తెలిపారు. బైరేగౌడ, కోచిముల్ మాజీ డైరెక్టర్ బంకు మునియప్ప, గ్రామపెద్దలు ఎంసీ జగదీశ్, ఈఓ ఎం వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న రామచంద్రాచారి

విద్యార్థులకు జేఎన్‌టీయూ వరం

- కొనియాడిన కియ ప్రతినిధులు
- వర్సిటీతో ఎంఓయూకు అంగీకారం
- హర్షం వ్యక్తం చేసిన ఇన్‌చార్జి వీసీ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 25: టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు మౌలిక సదుపాయాలు కల్పించిన జేఎన్‌టీయూ ఈ ప్రాంత విద్యార్థులకు వరమని కియ ప్రతినిధులు ప్రశంసించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆధ్వర్యంలో కియ ప్రతినిధులు హంగ్‌సంగ్ పార్క్, హంగు కిమ్, శ్రీహాసన్ బృందం వర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం సందర్శించింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ల్యాబ్‌లు, సీమెన్స్ ల్యాబ్, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాన్ని వారు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వీసీ సుదర్శన రావు మాట్లాడుతూ, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కియ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం ఉందని అన్నారు. కియను ఫ్యాకల్టీ సందర్శించి, అక్కడి పనులపై పరిశోధనలు చేయవచ్చునని తెలిపారు. రియల్ టైమ్ సమస్యలను పరిష్కరించడానికి, ప్రాజెక్టులు చేయడానికి కియలో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవడానికి కియతో ఒప్పంద కుదుర్చుకునేందుకు ఆహ్వానం పలికామని అన్నారు. కియ ప్రతినిధులు వర్సిటీని సందర్శించి, ఎంఓయూకు ఒప్పుకోవడం శుభపరిణామమని అన్నారు. కియ, జేఎన్‌టీయూ పరస్పర సహకారంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు. ఆ దిశగా గతంలో ప్రయత్నాలు జరగలేదని, దీంతో ఆ సంస్థ ప్రతినిధులు వర్సిటీకి రాలేదని అన్నారు. తొలి సందర్శనలోనే జేఎన్‌టీయూ సేవలను వినియోగించుకునేందుకు కియ ప్రతినిధులు సముఖత వ్యక్తం చేశారని అన్నారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విశాలి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కియ ప్రతినిధులు ఉపాశంకర్ పట్నాయక్, రమేష్‌బాబు, విజయ పాయ్, డీపీపీ కోఆర్డినేటర్ అరుణ మస్తాని, హెచ్‌ఓడీలు కళ్యాణిరాధ, రామశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కియ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ

నాగలమడకను సందర్శించిన దేవదాయశాఖ కమిషనర్

పావగడ, సెప్టెంబరు 25 : ఉత్తర పినాకిని నది ఒడ్డున కొలువుదీరిన నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్ బుధవారం సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో కొలువుదీరిన సుబ్రమణ్యేశ్వరస్వామి దేవాలయం మహిమను ఎన్నోసార్లు విన్నానని నేడు ప్రత్యక్షంగా దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కమిషనర్ అన్నారు. దేవాలయం పురాతన కాలంలో నిర్మించారని, భక్తుల సంఖ్య అధికమవుతుండటంతో పునఃనిర్మించేందుకు, అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని ఆయన తెలిపారు. జాతర సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. దేవాలయానికి వస్తున్న ఆదాయంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి కూడా కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి వెంకటరమణప్ప, దేవదాయశాఖ అధికారి వరదరాజు, ప్రజా పనుల శాఖ అధికారి అనిల్‌కుమార్, ఆగమ పండితుల గ్రూప్ అధ్యక్షులు రాజేశ్వరి, రెవెన్యూ అధికారులు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.



ఆలయ వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 25: బెంగళూరు కంటోన్మెంటు ప్లాట్‌ఫారాల పనుల కారణంగా మైసూరు-జైపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం.12975) రైలుకు డిసెంబరు 19వ తేదీ వరకు ఈ స్టేషన్ స్టాపింగ్‌ను తొలగించినట్టు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపడం జరగదన్నారు. కోయంబత్తూరు-ముంబై రైలు (నెం.11014)ను, ముంబై-కోయంబత్తూరు-ముంబై (నెం. 11013/14) రైళ్లను, బెంగళూరు-న్యూఢిల్లీ (నెం. 12627), బెంగళూరు-ముంబై నెఎం. 11302) రైలును, బెంగళూరు-నాందేడ్ (నెం. 16593) రైలును డిసెంబరు 20వ తేదీ వరకు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపడం ఉండదన్నారు. నాందేడ్-బెంగళూరు (నెం. 16220), ముంబై-బెంగళూరు (నెం. 11301), కాచిగూడ-మైసూరు (నెం. 12785), భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి (నెం. 18463) రైలుకు, న్యూఢిల్లీ-బెంగళూరు (నెం. 12628) రైలుకు, జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12976)కు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో స్టాపింగ్‌ను రద్దుచేసినట్లు తెలియజేశారు.

క్రీడలతోపాటు పౌష్టికాహారం ముఖ్యమే

▸▸ క్రికెటర్ శ్రేయంకా పాటిల్

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో పాటు పౌష్టికాహారం ముఖ్యమని ప్రముఖ క్రికెటర్ శ్రేయంకా పాటిల్ అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలో ఐటీసీ సన్‌ఫీస్ట్ బేక్డ్ క్రియేషన్స్ ద్వారా తొలి బేకరీ కెఫెను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రేయంకా పాటిల్‌ను చూసేందుకు యువత, క్రీడా కారులు పెద్దసంఖ్యలో వచ్చారు. శ్రేయంకా పాటిల్ మాట్లాడుతూ క్లౌడ్ కిచెన్ బేకరీ నుంచి ఓమ్నిచానెల్ బ్రాండ్‌కు రావడం సంతోషమన్నారు. ఐటీసీతో నాకు ఉత్తమ సంబంధం ఉందన్నారు. ఐటీసీ ఫుడ్ టెక్ రోహిత్ భల్లా మాట్లాడుతూ ఐటీసీ సన్‌ఫీస్ట్ సుదీర్ఘ కాలంగా బిస్కట్‌లతోపాటు పలు ఉత్పత్తులు చేస్తోందన్నారు. బేకరీ వ్యాపారంలోకి వస్తున్నామన్నారు. ఇప్పటికే డిస్ట్రి బ్యూషన్ ద్వారా ప్రజారణ పొందామన్నారు. 30మంది ఆస్వాదించేలాంటి విలాసవంతమైన, సౌకర్యవంతమైన లాంజ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

దసరాకోసం రాజస్థానీ కలెక్షన్

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని రాజస్థానీ కలెక్షన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జేపీ నగర్ కొత్తనూరు రోడ్డు సోమేశ్వర సభాభవనంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో కాటన్, సిల్క్, చేనేత, హస్తకళలు, ఒడిశ్యా టై అండ్ డై, డ్రెస్ మెటీరియల్స్, ఒడిశ్యా చీరలు ఏర్పాటు చేశామన్నారు. దసరా పండుగను మరింత రంగులుగా తీర్చుకునేలా ఆధునిక డిజైన్‌లు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. బట్టలతోపాటు అలంకరణ వస్తువులు, గృహోపలంకరణలు ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు.

డెల్టా ఆర్‌అండ్‌డీ సెంటర్ ఆరంభం

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ స్థాయిలో పవర్ మేనేజిమెంట్, ఐఓటీ బేస్డ్ సంస్థ డెల్టా తన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నగరంలో లాంచనంగా ప్రారంభించింది. సంస్థ ఇండియా అధ్యక్షుడు బెంజమిన్ లిన్ మాట్లాడుతూ సాంకేతికంగా భారత్ ముందంజలో దూసుకుపోతోందని, ఐటీ నగరిలో ఆర్ అండ్‌డీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎండీ నిరంజన్ నాయక్ మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని పవర్ ఎలక్ట్రానిక్స్‌లో కొత్త విధానాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు.

నైపుణ్యంతో ఉద్యోగం తథ్యం



స్నాతకోత్సవంలో ప్రముఖులు

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 25: నిజమైన నైపుణ్యం ఉంటే తప్పకుండా ఉద్యోగం వస్తుందని జగదీశ్ మయ్య అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని నాగార్జున కళాశాలలో ఏర్పాటైన స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్ పాల్గొని మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు విద్యను అందించే చక్కటి వాతావరణం ఉందన్నారు. పోటీయుగంలో విద్యార్థులు సాంకేతికతలోనూ రాణించాలన్నారు. నైపుణ్యం ఉన్న వారికి ఎప్పుడూ మంచి అవకాశాలు తథ్యమన్నారు. చదువుతోపాటు ప్రతిభతోనే విస్తారమైన అవకాశాలు సాధ్యమన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఏజీ గోపాలకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రథానికి నిప్పు పెట్టింది వైసీపీ నాయకుడే

● అరెస్టు చేసిన పోలీసులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 25: కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామంలో రాములోరి రథానికి నిప్పంటించిన ఘటనలో వైసీపీ నాయకుడు బోడిమల్ల ఈశ్వర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ జగదీష్ బుధవారం విలేకరులకు తెలిపారు. రాములోరి రథాన్ని 2022లో అదే గ్రామానికి చెందిన ఎర్రిస్వామిరెడ్డి సోదరులు రూ.20లక్షలు వెచ్చించి తయారు చేయించారని అన్నారు. రథం తయారీకి వారు గ్రామంలో ఎవరి సహాయసహకారాలు, చందాలు తీసుకోలేదని, దీంతో గ్రామస్థుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 23న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రథాన్ని భద్రపరిచిన మండపం తాళాలు పగులగొట్టి అందులో ప్రవేశించారని, అనంతరం రథానికి నిప్పు పెట్టారని తెలిపారు. మంటలు ఎగిసి పడటాన్ని మండపం సమీపంలోని ఇళ్ల వారు గమనించి అక్కడికి వచ్చి ఆర్పివేశారని తెలిపారు. రథం తయారీలో తమ సహకారం తీసుకోలేదనే అక్కసుతోనే గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఈ ఘటనకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఐదారుగురిని విచారించామని, ఈశ్వర్‌రెడ్డిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు.



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్